సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం । 27 । జూలై । 2025



పోలీసుల పాత్ర కీలకం

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమైనదని.. పోలీసు, జ్యుడిషియల్ శాఖల అమలులో నిక్కచ్చిగా వ్యవహరిస్తేనే నేరాలను అరికట్టగలమని కలెక్టర్ అన్నారు. - 8లో



టీడీపీ అరాచకాలకు అడ్డుకట్ట వేస్తాం

టీడీపీ నాయకులు చేస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేస్తామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి స్పష్టం చేశారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0 /26.0

జిల్లాలో శనివారం 26.0 - 34.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్.

సంక్షేమం.. నేల చూపులు

ఒకే దుప్పటిలో నిద్రిస్తున్న ఇద్దరు విద్యార్థులు



పిల్లలకు ఇప్పటికీ దుప్పటి కరువే..
దోమలతో.. విష పురుగులతో
నిత్యం సావాసమే..
చుట్టూ మురికిమయం..
పెచ్చులూడుతున్న కప్పులతో భయంభయం..
ఏళ్లు గడుస్తున్నా
హాస్టల్ విద్యార్థులకు మేలు జరగడం లేదు.
బడ్జెట్‌లో కేటాయింపులు కోట్లలో ఉన్నా..
కటిక నేలపై నిద్ర తప్పడం లేదు.
కాంట్రాక్టర్ల ధన దాహానికి..
అధికారుల నిర్లక్ష్య రోగానికి..
సంక్షేమ హాస్టళ్లలో క్షేమం మాయమైంది.
నిరుపేద విద్యార్థుల అభ్యున్నతి..
వసతి.. గాలిలో దీపంలా మారింది.

హాస్టళ్లలో నెలకొన్న అధ్వాన పరిస్థితులపై ఉన్నతాధికారులపై హై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 'సాక్షి'నిర్వహించిన హాస్టల్ విజిట్‌లో విస్తుపోయే అంశాలు వెలుగు చూశాయి.

- కప్పుకునే దుప్పటికీ కరువే
- సక్రమంగా అందని మెనూ
- సంక్షోభంలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు



కడప నగరంలోని మద్రాసురోడ్డులో ఉన్న ఎస్సీ హాస్టల్‌లో వరండాలో నేలపైనే నిద్రిస్తున్న విద్యార్థులు

కడప రూరల్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో సమస్యలు తిష్ట వేశాయి. ముఖ్యంగా టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కొలువుదీరాక సమస్యలు మొదలయ్యాయి. అంతకు ముందు మెరుగైన వసతులతో వెలుగొందిన హాస్టళ్లు, నేడు సమస్యల చీకట్లతో కొట్టు మిట్టాడుతున్నాయి. చాలా హాస్టళ్లలో 'మెను'దారి తప్పింది. 2023లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెను చార్జీలను పెంచడంతో పాటు రుచి, శుచికరమైన వంటలను విద్యార్థులకు వడ్డించడానికి వంట వారికి శిక్షణను కూడా ఇప్పించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నిత్యావసర ధరల్లో పెను మార్పులు సంభవించాయి. దీంతో మెను అమలు 'పలచ'బడింది. ఫలితంగా విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు.

ఒకటిన్నర నెల దాటినా అందని దుప్పట్లు..

ఎస్సీ, బీసీ హాస్టళ్లలో ప్రీ మెట్రిక్ 3 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు ఉంటారు. వారంతా కటిక నేలపైనే పడుకుంటున్నారు. తమ ఇంట్లో ఎంత నిరుపేదలైనా కనీసం నులక మంచంపైనైనా నిద్రిస్తారు. ఇక్కడ ప్రభుత్వ హాస్టళ్లలో మాత్రం నేలపైనే పడుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతంలోనే ఉండే హాస్టళ్లలో విద్యార్థులు కింద పడుకోవడం వల్ల విష సర్పాలు, ఇతర కీటకాలతో పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉంది.

జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలతో పాటే హాస్టళ్లు కూడా ప్రారంభం అయ్యాయి. హాస్టళ్లు ప్రారంభం రోజు లేదంటే వారం, పది రోజుల్లో ఒక విద్యార్థికి కప్పుకోవడానికి ఒక దుప్పటి, పరచుకోవడానికి ఒక కార్పెట్ ఇవ్వాలి. ఒకటిన్నర నెల అవుతున్నా విద్యార్థులకు దుప్పటి, కార్పెట్ ఇవ్వకపోవడం శోచనీయం. కాగా ఏడాదికి ఒక సారి విద్యార్థికి దుప్పటి, కార్పెట్ ఇవ్వాలి. ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయి. చలి వాతావరణం నెలకొంది. అసలే చిన్న పిల్లలు ఆపై అనుకూలించని వాతావరణం. ఇకపై వచ్చేదంతా చలికాలమే, దీంతో ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న దుప్పటి లేదా సహచర మిత్రుని కుండే దుప్పటితోనే సరిపెట్టుకుంటున్నారు. అలాగే ట్రంక్ పెట్టె, ప్లేటు, గ్లాసు మూడేళ్లకు ఒక సారి ఇవ్వాలి. చాలా మందికి ట్రంక్ పెట్టె అందని పరిస్థితి ఏర్పడింది. బీసీ హాస్టళ్లలో సమస్యల తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. ప్రీ మెట్రిక్ హాస్టళ్లకు సంబంధించి బీసీ సంక్షేమ శాఖ పరిధిలో 18 హాస్టళ్లు ప్రైవేట్ భవనాల్లో నడుస్తున్నాయి. సోషల్ వెల్ఫేర్ పరిధిలో ఏడు హాస్టళ్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. చాలా వరకు ప్రీ మెట్రిక్‌తో పాటు కళాశాల హాస్టళ్లలో విద్యార్థులకు సరిపడే మరుగు దొడ్లు, బాత్ రూమ్‌లు లేక ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలోని హాస్టళ్ల వివరాలు

శాఖ విభాగం	హాస్టళ్లు	విద్యార్థులు
ఎస్సీ ప్రీ మెట్రిక్	53	5,243
పోస్ట్ మెట్రిక్	14	1,610
బీసీ ప్రీ మెట్రిక్	30	2,194
పోస్ట్ మెట్రిక్	14	1,027
ఎస్టీ ప్రీ మెట్రిక్	01	150
పోస్ట్ మెట్రిక్	02	118
ఇంటిగ్రేటెడ్	01	130

- మైదుకూరు నియోజక వర్గంలోని దువ్వూరు బీసీ బాలుర హాస్టల్‌లో మెను ప్రకారం విద్యార్థులకు ఆహారం అందలేదు. పలుగురాళ్లపల్లె ఎస్సీ బాలుర హాస్టల్‌లో 70 మంది విద్యార్థులకు నాలుగు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. మైదుకూరులోని బీసీ బాలికలు, బాలుర, ఎస్సీ బాలుర హాస్టళ్లు అద్దె భవనాల్లో అసౌకర్యాల మధ్య నడుస్తున్నాయి.
- బద్వేల్ పరిధిలో ఎస్సీ బాలుర హాస్టల్ శిథిల అద్దె భవనంలో కొనసాగుతోంది. వర్షాలకు ఉరుస్తోంది. గిరినగర్‌లో ఉండే ఎస్సీ బాలిక హాస్టల్‌లో విద్యార్థులు హాస్టల్‌లో ఆహారం తిని ఇళ్లకు వెళ్తున్నారు.
- ప్రొద్దుటూరులో ఎస్సీ-1, 2 హాస్టల్‌లో కిటికీలకు మెష్‌లు లేవు. దీంతో దోమల మోత ఎక్కువైంది. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

దోమల బెడద ఎక్కువగా ఉంది



హాస్టల్‌లో దోమల బెడద ఎక్కువగా ఉంది. సాయంత్రం అయితే చాలు దోమలు, ఇతర పురుగులు సంచరిస్తున్నాయి. కిటికీలకు మెష్‌లను ఏర్పాటు చేయాలి.

– పద్మ తేజ, విద్యార్థి, ఎస్సీ కళాశాల బాలుర హాస్టల్, ప్రొద్దుటూరు.

మంచాలను ఏర్పాటు చేయాలి



హాస్టల్ విద్యార్థులకు మంచాలను ఏర్పాటు చేయాలి. హాస్టల్‌లో మంచాలు లేకపోవడంతో నేలపైనే పడుకోవాల్సి వస్తోంది. చలికాలంలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది.

– రాజు, విద్యార్థి, ఎస్సీ బాలుర హాస్టల్-2, ప్రొద్దుటూరు.

సమస్యలను పరిష్కరిస్తాం

మా హాస్టళ్లకు ఒక నెలకు సంబంధించిన డైట్, కాస్మోటిక్ బిల్లులు రావాల్సి ఉంది. విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తాం. నేను ఇక్కడికి కొత్తగా వచ్చాను. వివరాలను తెలుసుకుంటున్నాను. సమస్యలు ఏవైనా ఉంటే పరిష్కరిస్తాను.

– ఎం అంజల, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి

● 'వసతి' కరువు



మైలవరం మండలం దొమ్మరనంద్యాల గ్రామంలో ఉన్న బీసీ హాస్టల్ వసతులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా తరగతి గదులు లేకపోవడంతో అనేక మంది విద్యార్థులు వెనుతిరిగి పోతున్నారు. ఇక్కడ 199 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి సరిపడ గదులు లేకపోవడంతో అదనపు గదుల కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్లామని హాస్టల్ వార్డన్ వెంకటరెడ్డి తెలిపారు.

● నిద్ర బరువు..



లింగాల మండలంలోని ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాలలో కనీస సౌకర్యాలు లేవు. ఇప్పటి వరకు దుప్పట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు వారి ఇళ్ల నుంచి చాపలు, దుప్పట్లు తెచ్చుకున్నారు. ఇక సరైన వసతి లేక అక్కడే చదువుకోవడం... అలాగే నిద్రలోకి జారుకోవడం పరిపాటైంది. బీసీ హాస్టల్‌కు పర్మినెంట్ వార్డెన్ కూడా లేరు. రాత్రిపూట వాచ్‌మెన్ల సహాయంతోనే వసతి గృహాలు కొనసాగుతున్నాయి.

● అధ్వానం..



ప్రొద్దుటూరులోని ప్రభుత్వ హాస్టళ్లలో వసతి అధ్వానంగా మారింది. చాలా హాస్టళ్లకు కిటికీలకు మెష్‌లు లేవు. దీంతో దోమలు ఎంచక్కా వీర విహారం చేస్తున్నాయి. విద్యార్థులతో జాగారం చేయిస్తున్నాయి. బాత్రూంలకు డోర్లు లేవు. పాపం విద్యార్థులు చెప్పుకోలేని బాధతో నరకం అనుభవిస్తున్నారు. ఇక వంట గది గురించి ఎంత తక్కువగా మాట్లాడుకుంటే అంత మంచిది. శుచీ శుభ్రత కరువైంది. రోగాలకు ఆలవాలంగా మారింది.

● భయం.. భయం!



బద్వేలు పట్టణంలోని హాస్టళ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. పెచ్చులూడుతున్న పైకప్పులతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటున్నారు. పట్టణంలోని స్థానిక బీసీ బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతోంది. దీంతో వసతి గృహంలోని వంటగది, మరో నాలుగు గదులను మూసివేశారు. ఇక పోరుమామిళ్ల పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్ భవనం కూలిపోయే స్థితిలో ఉంది. కొద్దిపాటి చినుకులు పడ్డా ఉరుస్తున్నాయి.

న్యూస్‌రీల్

నేడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక

కడప కోటిరెడ్డిసర్కిల్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆదివారం కడప పర్యటనకు రానున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ఉదయం 7.30 గంటలకు వాయుపుత్ర కేఫ్‌లో ఛాయ్‌పై చర్చా కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం కడపలో జరిగే శోభాయాత్రలో పాల్గొనడంతో పాటు.. ఆదిత్య కల్యాణ మండపంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారన్నారు. సాయంత్రం సీపీ బ్రౌన్ గ్రంథాలయం, కొత్తాస్ పరిశ్రమను సందర్శిస్తారని వివరించారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కడప కార్పొరేషన్ : విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఈనెల 27వ తేది ఆదివారం సెలవు అయినప్పటికీ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథాతథంగా పని చేస్తాయని జిల్లా విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ పురోభివృద్ధికి సహకరించాలని కోరారు.

డీసీఆర్‌బీ కార్యాలయం ప్రారంభం



డీసీఆర్‌బీ కార్యాలయాన్ని ప్రారంభించి, పరిశీలిస్తున్న కర్నూలు రేంజ్ డీఐజీ కోయప్రవీణ్

కడప అర్బన్ : జిల్లా పోలీస్ కార్యాలయంలో పునరుద్ధరించిన డీసీఆర్‌బీ కార్యాలయాన్ని శనివారం కర్నూల్ రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ ప్రారంభించారు. అనంతరం కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్.పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, ఏ.ఆర్ డి.ఎస్.పి కె.శ్రీనివాసరావు, పులివెందుల డి.ఎస్.పి మురళి నాయక్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి, ఎస్.ఐ బి.వి కృష్ణయ్య పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం నారమరాజుపల్లెలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-2027 విద్యాసంవత్సరానికి 9 వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సెప్టెంబరు 23లోపు దరఖాస్తులు పంపుకోవాలన్నారు. దరఖాస్తు ఫారాలను ఆన్‌లైన్, నవోదయ వెబ్‌సైట్‌లలో ఉంటాయన్నారు.

బాలికల ఫుట్‌బాల్ విజేత కడప జట్టు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రముఖ వైద్యులు కార్తీక్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగర శివారులోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో నిర్వహించిన ఇంటర్-పెన్నా జోన్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో కడప జిల్లా జట్టు విజేతగా నిలిచింది. చివరి రోజైన శనివారం ఎంతో ఉత్సాహంతో పోటీలు జరిగాయి. ఈ టోర్నమెంట్‌లో కడప, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల జట్లు పాల్గొన్నాయి. హోస్ట్ జట్టు అయిన కడప జిల్లా, రెండు మ్యాచ్‌ల్లోనూ విజయవంతంగా పోటీపడి జోనల్ చాంపియన్‌గా అవతరించింది. మొదటి మ్యాచ్‌లో శ్రీ సత్య సాయి జిల్లాను 6-0 గోల్స్ తేడాతో ఓడించగా, తర్వాత అన్నమయ్య జిల్లాను 5-0 గోల్స్ తేడాతో ఓడించి తమ ఆధిపత్యాన్ని మరోసారి ప్రదర్శించింది. ఈ విజయాలతో కడప జట్టు నెల్లూరు జిల్లాలో త్వరలో జరగబోయే ఆంధ్రప్రదేశ్ ఇంటర్-జోనల్ మీట్‌కి అర్హత సాధించింది. ఈ జట్టులో ఎంపికైన ఆటగాళ్లు ఆగస్టు 20వ తేదీ నుంచి 30 వరకు బీహార్‌లో జరగబోయే అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య నిర్వహించే జాతీయ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి కార్తిక్ డెంటల్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ కార్తిక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ వయస్సులో ఆరోగ్య పరిరక్షణ ఎంత ముఖ్యమో వివరిస్తూ, క్రమం తప్పకుండా క్రీడలలో పాల్గొనడం ద్వారా స్ట్రెస్, డిప్రెషన్ లాంటి సమస్యలపై పోరాడవచ్చని పేర్కొన్నారు. క్రీడల పట్ల బాలికల్లో కనిపించిన నిబద్ధత, నైపుణ్యం, పట్టుదలకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సుధీర్, కార్యక్రమ నిర్వాహకుడు అనిల్, వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్ కోచ్ ఎం.హరి, అన్నమయ్య జిల్లా కార్యదర్శి మురళీధర్, సత్యసాయి జిల్లా కార్యదర్శి సలీమ్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్ల కోసం లాటరీ డ్రా

రాయచోటి జగదాంబసెంటర్ : కడప, అన్నమయ్య జిల్లాలలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో మిగిలిన సీట్లను లాటరీ పద్ధతిలో నింపుతున్నట్లు జిల్లా సమన్వయాధికారి ఎ.ఉదయశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లాటరీ డ్రా కార్యక్రమం కడప జిల్లాలోని అంబేడ్కర్ గురుకులాల కోసం ఈ నెల 31న కమలాపురంలోని గురుకుల పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి లాటరీ ద్వారా సీట్లు కేటాయించనున్నట్లు చెప్పారు. అదే విధంగా అన్నమయ్య జిల్లా కోసం ఆగస్టు 8వ తేదీన రాయచోటిలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి లాటరీ ద్వారా సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కొరకు కడప, అన్నమయ్య జిల్లాల్లో ని స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో సంప్రదించాలని ఆమె తెలియజేశారు. ప్రవేశ పరీక్ష రాయని వారు కూడా అర్హులని తెలిపారు.

వైద్యుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం



రిమ్స్‌లో వైద్యుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభిస్తున్న ఏపీ వైద్యమండలి చైర్మన్ దగ్గుమాటి శ్రీహరిరావు, వైద్యులు

కడప అర్బన్ : వైద్యుల రిజిస్ట్రేషన్, రెన్యూవల్ తదితర సేవల కోసం విజయవాడకు వెళ్లాల్సిన అవసరం లేదని.. కడప రిమ్స్ ఆవరణలో వైద్యుల రిజిస్ట్రేషన్‌తో పాటు, రీ- రిజిస్ట్రేషన్, రెన్యువల్ సేవలు అందుబాటులో ఉన్నాయని ఏపీ వైద్య మండలి చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు నందకిశోర్ అన్నారు. శనివారం వారు సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యులు తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రక్రియ ఈనెల 27న కూడా నిర్వహించనున్నారు. ఐఎంఏ ఈసీ మెంబర్ డాక్టర్ వరుణ్‌కుమార్, డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసమ్మ, కడప జీజీహెచ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు, కో-ఆర్డినేటర్ డాక్టర్ ఫహీం, కడప ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ అర్జున్‌కుమార్ అవ్వారు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్య బలోపేతానికి కృషి చేస్తా

– ఇంటర్ విద్య నూతన ఆర్‌జేడీ సురేష్‌బాబు



కడప ఎడ్యుకేషన్ : రాయలసీమ పరిధిలోని కడప, కర్నూల్, చిత్తూరు, అనంతపురం జిల్లాల పరిధిలో ఇంటర్మీడియట్ విద్య బలోపేతానికి అందరి సహకారంతో కృషి చేస్తానని ఇంటర్ విద్య ఆర్‌జేడీ సురేష్‌బాబు పేర్కొన్నారు. శనివారం కడప ఇంటర్మీడియట్ విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకుల వారి కార్యాలయంలో ఆర్‌జేడీ(ఎఫ్ఏసీ)గా సురేష్ బాబు బాధ్యతలు స్వీకరించారు. కడప ఆర్‌జేడీగా పనిచేస్తున్న శ్రీనివాసులు గత నెల ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో కర్నూల్ జిల్లా డీఐఈఓగా పనిచేస్తున్న సురేష్‌బాబును కడప ఎఫ్ఏసీ ఆర్‌జేడీగా నియమించింది.

బాల్య వివాహాల కట్టడికి చర్యలు

ఐసీడీఎస్ పీడీ రమాదేవి



ఐసీడీఎస్ పీడీరమాదేవికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న సీడీపీఓలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో బాల్య వివాహాల నిరోధానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జిల్లా స్త్రీ శిశుసంక్షేమశాఖ అధికారి పోలిశెట్టి రమాదేవి తెలిపారు. శనివారం జిల్లా ఐసీడీఎస్ పీడీగా బాధ్యతలు స్వీకరించారు. 2008లో సీడీపీఓగా బాధ్యతలు స్వీకరించిన ఆమె అనంతరం పలు ప్రాంతాల్లో పని చేస్తూ ఇటీవల కల్పించిన పదోన్నతుల్లో కడప ఐసీడీఎస్‌పీడీగా నియామకమయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న పీడీ దేవిరెడ్డి శ్రీలక్ష్మిని మాతృ సంస్థకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా రమాదేవి మీడియాతో మాట్లాడుతూ బరువు తక్కువగా ఉండే పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని, అలాగే ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు తనవంతుగా కృషిచేస్తానన్నారు. అనంతరం ఆమెను పలువురు సీడీపీఓలు, అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ గాంధీ, డీసీపీఓ సుభాష్ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం ఆమె కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరిని కలిసి శాఖపరమైన అంశాలను తెలియజేశారు.

శ్రీహరి కోటకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : శ్రీహరికోట రాకెట్ లాంచింగ్ ప్రత్యక్షంగా చూసేందుకు ఈనెల 30వ తేదిన కడప డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామని కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. బుధవారం ఉదయం 6 గంటలకు ఆయా స్కూలు, కళాశాలల నుంచి బస్సులు బయలుదేరుతాయని పేర్కొన్నారు. ఒక్కొక్కరికి టిక్కెట్ ధర రాను, పోను కడప నుంచి రూ. 1000లుగా నిర్ణయించామన్నారు. ఇస్రో శ్లాట్ బుకింగ్ కోసం విద్యా సంస్థల నుంచి రిజిస్ట్రేషన్ కాపీ అందజేయాలని ఆయన కోరారు. ఈ అవకాశాన్ని నగరంలోని కళాశాలలు, పాఠశాలలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బుధవారం ఉదయం 6 గంటలకు బస్సులు బయలుదేరి నేలపట్టు (పక్షుల నివాస క్షేత్రం) సూళ్లూరుపేట అమ్మవారి గుడి, పులికాట్‌సరస్సు, శ్రీహరికోట లాంచింగ్ కేంద్రం షార్ మ్యూజియాన్ని చూపిస్తామని వివరించారు.

ట్రిపుల్ ఐటీ.. కులాల కుంపటి!

- అణగారిన వర్గాలకు చెందిన అధ్యాపకులపై వివక్ష
- కుల అహంకారంతో రెచ్చిపోయి అనుచిత వ్యాఖ్యలు
- భరించలేక డైరెక్టర్‌కు ఫిర్యాదు చేసిన తెలుగుశాఖ మెంటార్
- విచారణకు ఆదేశించిన డైరెక్టర్... ఆపై 'కమ్మ'ని ఒత్తిళ్లు



సాక్షి ప్రతినిధి, కడప : అధ్యాపకులు విలువలను గాలికొదిలేస్తున్నారు. చదువు..సంస్కారాన్ని మరిచి కులాల కుంపట్లలో మునిగి తేలుతున్నారు. రేపటి సమాజాన్ని నిర్మించాల్సిన స్థానంలో ఉండి 'గురు'తర బాధ్యతలను విస్మరిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ అధ్యాపకుల మధ్య కులాల రగడ మొదలైంది. ఉన్నతస్థాయిలో ఉంటూనే వ్యక్తిత్వలోపంతో కులాల పరంగా దూషణలకు దిగుతున్నారు. అణగారిన వర్గాలకు చెందిన అధ్యాపకులపై వివక్ష చూపిస్తున్న ఘటన తాజాగా తెరపైకి వచ్చింది.

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ తెలుగుశాఖకు చెందిన ఓ మెంటార్‌ను అదే శాఖకు చెందిన భార్యాభర్తలైన అధ్యాపకులు కులంపేరుతో దూషణలకు దిగారు. వ్యక్తిగత జీవితంపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. విద్యాసంస్థపై దిగజారుడు మాటలు మాట్లాడారు. ఇలాంటి ఘటనలు ముందెన్నడూ ఉత్పన్నం కాలేదు. గడిచిన ఏడాదిగా ట్రిపుల్ ఐటీ క్యాంటీన్ల కోసం అటు టీడీపీ వర్గీయుల దౌర్జన్యం, ఇటు ఆదే సామాజికవర్గానికి చెందిన అధ్యాపకుల అనుచిత వ్యాఖ్యలు తరచూ తెరపైకి వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో తెలుగుశాఖ మెంటార్ డైరెక్టర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. భార్యాభర్తలైన అధ్యాపకులిద్దరు వ్యవహరించిన, దూషించిన, అవమానపర్చిన ధోరణిని అందులో వివరించారు. ఆపై డైరెక్టర్ కుమారస్వామి గుప్తా కంప్యూటర్ సైన్సు ప్రొఫెసర్ రత్నకుమారి చైర్మన్‌గా ఒక కమిటీ ఏర్పాటు చేశారు. విచారించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ క్రమంలో తెలుగుమెంటార్‌పై అనుచిత వ్యాఖ్యానాలు, దూషణలు నిజమేనని మరో ఇద్దరు మెంటార్లు చెప్పుకొచ్చారు. దాంతో దంపతులిద్దరికీ అసహనానికి లోనయ్యారు. తనపై ఏకంగా అత్యాచారానికి యత్నించారని అధ్యాపకురాలు డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇవన్నీ విచారణ కమిటీ ముందుకు వచ్చాయి. కమిటీ చైర్మన్, సభ్యులు విచారణ పూర్తి చేసి నివేదికను డైరెక్టర్‌కు సమర్పించారు.

చర్యలకు వెనుకంజ...

ఉన్నత స్థాయి విద్యా సంస్థలో కులాలు కుంపట్లు తెరపైకి తేవడాన్ని డైరెక్టర్ తీవ్రంగా పరిగణించాల్సి ఉంది. కాగా కమిటీ రిపోర్టును సైతం తొక్కిపెట్టినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. అధ్యాపకులైన దంపతులకు అండగా 'కమ్మ'గా హైలెవెల్ ఒత్తిడులు వచ్చినట్లు సమాచారం. వివాదాస్పదులైన అధ్యాపకుల దంపతులు పనితనంలోని అశ్రద్ధ, నిర్లక్ష్యం, బెదిరింపు ధోరణులు ఇలా అనేకం తెరపైకి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో కూడా కంటితుడుపు చర్యలకు మాత్రమే పరిమితమైనట్లు పలువురు వాపోతున్నారు. కాగా, ఈ విషయమై ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామిగుప్తా వివరణ కోరగా అదంతా ఇంటర్నల్ వ్యవహారం, పైగా ఇష్యూ సమసిపోయిందని చెప్పుకొచ్చారు. అసలు విషయం వెల్లడించేందుకు నిరాకరించడం గమనార్హం.

గంజాయి విక్రేతల అరెస్ట్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగరంలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ కృష్ణకుమార్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని కడప ప్రొహిబిషన్ అండ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప నగరంలో గంజాయి అమ్ముతున్నట్లు తమకు సమాచారం రావడంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు ఆదేశాల మేరకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ పర్యవేక్షణలో తమ సిబ్బందితో కలిసి దాడులు చేసినట్లు తెలిపారు. కడప నగరంలోని పుట్లంపల్లె చెరువు వద్ద ఐదుగురిని అరెస్ట్ చేశామన్నారు. చింతకొమ్మదిన్నె మండలం మామిళ్ళపల్లె గ్రామానికి చెందిన రావులకొల్లు విజయ్ నుంచి బద్వేలు టౌన్‌కు చెందిన కావడి శ్రీను, కడప నగర పరిధిలోని ఇందిరానగర్‌కు గంప మహేష్, శివానందపురానికి చెందిన షేక్ హుస్సేన్ వల్లి, ప్రకాశ్‌నగర్‌కు చెందిన మల్లిగేలి ఖాదర్ మొహిద్దీన్ కొనుగోలు చేసి ఇతరులకు, కళాశాల విద్యార్థులకు ప్యాకెట్లుగా తయారు చేసి వివిధ ప్రాంతాల్లో అమ్మకాలు సాగించేవారన్నారు. వీరి వద్ద నుంచి 1.5 కిలోల గంజాయి, 4 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ సమావేశంలో కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ నరసింహ, హెడ్ కానిస్టేబుళ్లు కృష్ణయ్య, రవికుమార్, మోహన్‌రెడ్డి కానిస్టేబుళ్లు సతీష్‌కుమార్ గౌడ్, గురు ప్రసాద్, నాగయ్య పాల్గొన్నారు.

టీడీపీ అరాచకాలకు అడ్డుకట్ట వేస్తాం

- కూల్చిన డాబా పరిశీలన
- ఎమ్మెల్యే పుట్టా, అధికారులపై ధ్వజం
- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


కూల్చిన డాబా వద్ద బాధితులను పరామర్శిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

దువ్వూరు : టీడీపీ నాయకులు చేస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేస్తామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని ఇడమడక గ్రామంలో కొన్ని రోజుల కిందట వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు, స్థానిక నేత నగరి శ్రీకాంత్ బావ అయిన ముద్దం వీరభద్రుడుకు చెందిన డాబాను టీడీపీ నాయకులు కక్ష పూరితంగా అధికారులతో కలిసి కూల్చివేశారు. విషయం తెలుసుకున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డితో కలిసి బాధితుడు వీరభద్రుడు, ఆయన కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగంగా రాజకీయ కక్షతో స్థానిక ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఆదేశాలతో రెవెన్యూ, పోలీసు అధికారులు కలిసి డాబాను కూల్చివేశారన్నారు. కేవలం వైఎస్సార్‌సీపీ నేతలనే కారణంతోనే అధికారులు డాబాను కూల్చారని, ఇది వారికి మంచి పద్ధతి కాదన్నారు. టీడీపీ ప్రభుత్వం అన్ని రకాలుగా విఫలమైందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని అధికారంలోకి వచ్చి ఏ పథకాన్ని సక్రమంగా అమలు చేయలేదన్నారు. ప్రభుత్వ అసమర్థతను ప్రశ్నించినందుకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. జగన్ చుట్టూ ఉన్న కీలక నాయకులను మద్యం స్కాంలో ఇరికించి జగన్‌ను ఇబ్బందులకు గురి చేసి వైఎస్సార్‌సీపీని నిర్వీర్యం చేయాలని కుటిల పన్నాగం పన్నారని ధ్వజమెత్తారు. అందులో భాగంగానే నేడు వైఎస్సార్‌సీపీ నాయకుల అరెస్టులు అన్నారు. చంద్రబాబు చేస్తున్న తప్పులను ప్రజలు గమనిస్తున్నారని, సమయం వస్తే కచ్చితంగా గుణపాఠం చెబుతారన్నారు. తప్పుడు రాజకీయాలు, అక్రమ అరెస్టులు, అసత్య ప్రచారాలు ఇప్పటికైనా ఆపాలన్నారు. ప్రజలకు చెప్పిన సూపర్ 6 పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కక్ష సాధింపు చర్యలు తగదు

మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి మాట్లాడుతూ 30 ఏళ్ల నుంచి ముద్దం వీరభద్రుడు కుటుంబం ఈ డాబాపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఈ డాబాపై హైవే, ఆర్అండ్‌బీ అధికారులకు ఎలాంటి అభ్యంతరం లేదని, కేవలం మైదుకూరు ఎమ్మెల్యేకు మాత్రమే ఈ డాబా అభ్యంతరకరంగా ఉందన్నారు. జిల్లా స్థాయి అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఒకటే కోరుతున్నామని.. జిల్లాలోని హైవేపై, కేసీ కెనాల్‌పై ఉన్న అన్ని ఆక్రమణలను తొలగించిన తర్వాత, తమ పార్టీ నేతలకు చెందిన స్థలాలను స్వచ్ఛందంగా ఖాళీ చేస్తామన్నారు. దువ్వూరు, మైదుకూరు, కడపలలో కేసీ కెనాల్‌పై ఎన్నో ఆక్రమణలు ఉన్నాయని, అవేవి అధికారులకు కనపడటం లేదని, ఈ డాబా మాత్రమే అధికారులకు అక్రమంగా కనిపిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలాంటి కక్షసాధింపు చర్యలు చేపట్టలేదని, టీడీపీ నేతలు కేవలం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను టార్గెట్ చేయడం సరైన పద్ధతి కాదన్నారు. మీ ఆటలు ఎన్నో రోజులు సాగవని, ఇలాంటి చర్యలను జనం సహించరన్నారు. ప్రజలలో తిరుగుబాటు రాకముందే టీడీపీ నేతలు ఇలాంటి చౌకబారు రాజకీయాలు మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, ఉద్యాన శాఖల ప్రభుత్వ మాజీ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బొంతపల్లె సుబ్బారెడ్డి, కోగటం వీరారెడ్డి, మాజీ ఎంపీపీ విజయగోపాల్‌రెడ్డి, వ్యవసాయ మండల మాజీ చైర్మన్ ఓబుళకొండారెడ్డి, ఎంపీటీసీలు గోపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఖాదర్‌బాషా, సర్పంచ్‌లు రాజగోపాల్‌రెడ్డి, రసూల్ గౌస్, సుదర్శన్‌రెడ్డి, రామయ్య, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు ఓబుళరెడ్డి, మండల మాజీ కన్వీనర్ చిరాకి బాషా, నాయకులు గుర్రాల రామమునిరెడ్డి, జి.ఓబుళరెడ్డి, సానేపల్లి కిరణ్‌రెడ్డి, నాగరాజు, ఎస్.లక్ష్మిరెడ్డి, కె.సురేంద్ర, ఎల్.శేఖర్‌రెడ్డి, వై.రవీంద్రారెడ్డి, ఎం.ప్రతాప్‌రెడ్డి, ఎం.శివశంకర్‌రెడ్డి, వి.ఎల్లారెడ్డి, వీరమోహన్, మైదుకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హోరాహోరీగా అండర్–16 మల్టీ డే మ్యాచ్‌లు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్–16 మల్టీ డే మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. రెండవ రోజు శనివారం కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో అనంతపురం–కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. 75 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో మ్యాచ్‌ను ప్రారంభించిన కర్నూలు జట్టు 51.3 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని రుత్విక్ కళ్యాణ్ 30 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని సంజయ్ 3, కిరణ్‌కుమార్ 3, సంతోష్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 65 ఓవర్లకు 7 వికెట్లు కోల్పోయి 257 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఆర్.సాత్విక్ చక్కటి బ్యాటింగ్ చేసి 121 బంతుల్లో 131, ఆదినారాయణ 42 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని హితేష్ వర్దన్ 3, వివేక్ 3 వికెట్లు తీశారు. దీంతో అనంతపురం జట్టు 342 పరుగుల ఆధిక్యంలో ఉంది. దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

వైఎస్ఆర్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో..

వైఎస్ఆర్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న మరో మ్యాచ్‌లో చిత్తూరు–నెల్లూరు జట్లు పోటీ పడ్డాయి. 70 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో మ్యాచ్‌ను ప్రారంభించిన నెల్లూరు జట్టు 103.5 ఓవర్లలో 288 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని కె.సుశాంత్ 60, చైతన్య 52 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని నిహాల్ మాలిక్ 2, పార్థీవ్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 5 ఓవర్లకు వికెట్ నష్ట పోకుండా 40 పరుగులు చేసింది. దీంతో చిత్తూరు జట్టు 22 పరుగుల ఆధిక్యంలో ఉంది.

పెళ్లి కుదరడం లేదని.. యువకుడి ఆత్మహత్య

వేముల : గత కొన్నాళ్లుగా పెళ్లి సంబంధాలు చూస్తున్నా పెళ్లి కుదరకపోవడంతో మనస్తాపం చెంది యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వేముల మండలం వేల్పుల గ్రామంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మామిడి విష్ణువర్ధన్‌రెడ్డి(29) అనే యువకుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ డిసెంబర్‌లో ఉద్యోగం మానేశాడు. అప్పటి నుంచి ఉద్యోగం కోసం వెతుకులాట ప్రారంభించారు. ఎక్కడా ఉద్యోగం దొరకకపోవడంతోపాటు స్థిరాస్తులు, భూములు లేకపోవడంతో అమ్మాయిని ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఎన్ని సంబంధాలు చూసినా ఆస్తులు లేవని అమ్మాయిని ఇవ్వకపోవడంతో శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విష్ణువర్ధన్‌రెడ్డి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి కువైట్‌లో ఉండగా, తండ్రి కొంతకాలం క్రితం మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి సోదరుడు కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

జీతాల చెల్లింపులో ప్రభుత్వం విఫలం


డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : విద్యాశాఖ జూన్ మాసంలో నిర్వహించిన ఉపాధ్యాయ బదిలీలలో బదిలీ అయిన ఉపాధ్యాయులలో చాలా మందికి జీతాలు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. సంబంధిత సమస్యల పరిష్కారానికి శనివారం సాయంత్రం కడప డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2 వేల మంది ఉపాధ్యాయులు జీతాల చెల్లింపులకు నోచుకోక తీవ్ర అవస్థలను ఎదుర్కొంటున్నారన్నారు. బదిలీలు పూర్తయి 45 రోజులు దాటినా ఇంత వరకు ఆర్థిక శాఖ అనుమతి పొందకపోవడం, కేడర్ స్ట్రెంత్, పొజిషన్ ఐడీల సమస్యను పరిష్కరించకపోవడం దారుణమన్నారు. బదిలీలపై కొత్త ప్రాంతానికి వెళ్లిన ఉపాధ్యాయులు జీతభత్యాలు లేకపోతే ఎలా బతకాలో ప్రభుత్వమే సమాధానం చెప్పాలన్నారు. ఈ ధర్నాలో ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.వెంకటసుబ్బారెడ్డి పాల్గొని మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఏజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.క్రిష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు గంగన్న, లింగారెడ్డి, రామకేశవ, సుబ్బారెడ్డి, బత్తుల చంద్రశేఖర్, సుబ్బారెడ్డి, సూర్యకుమార్, పోతురాజు చంద్రశేఖర్, శ్రీకాంత్, శివశంకర్, అనిల్ కుమార్, మస్తానయ్య, బాబు నాయక్, సూర్య కుమార్, రంగనాయకులు, శేషగిరిరావు, లక్ష్మినారాయణ, నాగన్న, చెన్నయ్య, ప్రకాష్ బాబు, అబ్దుల్ ఘని, కరీముల్లా, హిఫాజతుల్లా తదితరులు పాల్గొన్నారు.

డీఈఓకు వినతి

బదిలీ అయిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని కోరుతూ బహుజన టీచర్స్ యూనియన్ నాయకులు డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున, ట్రెజరర్ రాజబాబు, జిల్లా అధ్యక్షుడు గంగరాజు, కార్యదర్శి జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ లైబ్రరీ కమిటీ చైర్మన్‌గా రామసుబ్బారెడ్డి


రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : అసెంబ్లీ పరిధిలోని లైబ్రరీ కమిటీ చైర్మన్‌గా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డిని స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ ఎంపిక చేసినట్లు ఏపీ జనరల్ సెక్రటరీ ప్రసన్న సూర్యదేవర ఉత్తర్వులు విడుదల చేశారు. శనివారం సాయంత్రం శాసనసభ, శాసన మండలి చైర్మన్‌ల ఆధ్వర్యంలో వివిధ రకాల కమిటీ చైర్మన్లు, సభ్యులను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా అసెంబ్లీ హాల్ పరిధిలోని లైబ్రరీ చైర్మన్‌గా జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డితోపాటు సభ్యులుగా జేసీ అస్మిత్‌రెడ్డి, నాగేశ్వరరావు, కనకాల సురేష్, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, రాము, కేతు శ్యాంకుమార్, విజయ్‌కుమార్, ఎమ్మెల్సీలు వంకా రవీంద్రనాథ్, సోమువీర్రాజులు ఉన్నారు.

27 నుంచి డిపార్టుమెంటల్ పరీక్షలు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాల్లో జరిగే ఏపీపీఎస్సీ డిపార్ట్ మెంటల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పరీక్షల నిర్వహణపై డీఆర్వో పరీక్షల జిల్లా ప్రత్యేక పర్యవేక్షకులు వి.బాబు రావు, అసిస్టెంట్ సెక్రటరీ భ్రమేశ్వర రావు, సెక్షన్ ఆఫీసర్లు లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో డిపార్ట్ మెంటల్ పరీక్షలు ఈ నెల 27వ నుంచి ఆగస్టు 1వ తేది వరకు జరుగుతాయన్నారు.

• గండి క్షేత్రం.. భక్తజన సందోహం



గండి క్షేత్రం భక్తజన సందోహంగా మారింది. శ్రావణ మాసం తొలి శనివారోత్సవం వేడుకలు వైభవంగా నిర్వహించారు. వీరాంజనేయస్వామిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తొలి శనివారం నాడే ఆలయానికి రూ.13 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. – చక్రాయపేట

రాజ్యాధికారంతోనే బీసీల అభ్యున్నతి

- రాజధానిలో బహిరంగ సభ.. ఉద్యమ కార్యాచరణ
- సమావేశంలో బీసీ కులాల వేదిక నేతలు


సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న బీసీ కులాల వేదిక నేతలు

కడప రూరల్ : రాజ్యాధికారంతోనే బీసీ వర్గాల అభ్యున్నతి సాధ్యమని బీసీ కులాల వేదిక నాయకులు పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి కులానికి రాజకీయ ప్రాధాన్యత కల్పించడం, బీసీలకు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా వేదిక పని చేస్తుందని వారు స్పష్టం చేశారు. కడపలోని బీసీ భవనంలో శనివారం బీసీ కులాల వేదిక ఆధ్వర్యంలో బీసీ కులాల రాయలసీమ జిల్లాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పావులూరి హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని పార్టీలు బీసీలకు అన్ని విధాలా అన్యాయం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పార్టీ ఎన్నికలకు ముందు బీసీ కులాలకు వరాలు ఇవ్వటం, గెలిచిన తరువాత మరిచిపోవటం పరిపాటి అయ్యిందని పేర్కొన్నారు. ఇక నుంచి ఓట్లు మావి సీట్లు కూడా మావే అనే నినాదంతో బీసీ కులాల వేదిక పని చేస్తుందని అన్నారు. స్థానికంగా జనాభా ఉన్న కులాలకు మాత్రమే అన్ని పార్టీలు అవకాశం ఇస్తున్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా జనాభా ఉన్న కులాలను పట్టించుకోవటం లేదని తెలియజేశారు. నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు ఇంటూరి బాబ్జి నంద మాట్లాడుతూ ఇప్పటి వరకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం లేని కులాలను అసెంబ్లీ, పార్లమెంట్ లోకి తీసుకొని పోవటానికి ప్రతి బీసీని చైతన్యం చేస్తామని తెలియజేశారు. 150కి పైగా ఉన్న బీసీ కులాలలో కేవలం 5, 6 కులాలకే అన్ని పార్టీలు ప్రాధాన్యత కల్పిస్తున్నాయని మిగిలిన కులాలను డబ్బులు లేవనో, కుల జనాభా లేదనో చట్టసభల్లో అవకాశం కల్పించటం లేదని అన్నారు. రాజ్యాధికారంలో భాగస్వామ్యం లేని కులాలు తమ హక్కులను సాధించుకోలేవని, బీసీలు రాజ్యాధికారంలో ఉంటేనే రాజ్యాంగాన్ని మార్చాగలరని, ఆ దిశగా బీసీ కులాల వేదిక కృషి చేస్తుందని అన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా సమావేశాలు

కుమ్మర శాలివాహన రాష్ట్ర నాయకులు గొల్లపల్లి లలిత్ ప్రజాపతి మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోనే బీసీల రిజర్వేషన్స్ సరిగా జరగలేదని, బీసీలకు కేవలం విద్యా, ఉద్యోగాలలో మాత్రమే రిజర్వేషన్స్ కల్పించారని దానికి కూడా క్రీమిలేయర్ పెట్టి రిజర్వేషన్స్ ఫలాలు బీసీలకు సరిగా అందకుండా చేశారన్నారు. దళితులకు జనాభా ప్రాతిపదికన విద్యా, ఉద్యోగాలు, రాజకీయాలలో రిజర్వేషన్స్ కల్పించి రక్షణ చట్టం కూడా ఏర్పాటు చేశారన్నారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్స్ కల్పించకపోవటం, రక్షణ చట్టం ఏర్పాటు చేయకపోవడంతో రిజర్వేషన్స్ వల్ల సరైన ఉపయోగం లేదని అన్నారు. అగ్నికుల క్షత్రియ రాష్ట్ర అధ్యక్షులు నాగిడి సాంబశివరావు మాట్లాడుతూ బీసీలను ఐక్యం చేయటానికి బీసీ కులాల వేదిక కృషి చేస్తుందని, తమ కులాల గుర్తింపు కోసం వచ్చే వారిని ప్రోత్సహిస్తూ, వారిని సమాజంలో నాయకులుగా నిలబెడతామని తెలియజేశారు. ఇప్పటికే కోస్తా, ఉత్తరాంధ్రలో సమావేశాలు ఏర్పాటు చేసి, అన్ని కులాల వారి అభిప్రాయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సమావేశాలు నిర్వహించి, అందరి అభిప్రాయాలతో విధానాలు రూపొందించి లక్ష మందితో రాష్ట్ర రాజధానిలో బహిరంగ సభ ఏర్పాటు చేసి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలియజేశారు. అలాగే పలు కులాల రాష్ట్ర, జిల్లా నాయకులు, మేధావులు మాట్లాడుతూ ఈ వేదికకు తమ మద్దతు తెలియజేశారు. బీసీల అభివృద్ధి కోసం మిగతా కులాల వారందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సంచార జాతుల రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి మనోజ్ కుమార్, నూర్ బాషా పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బాదుల్లా, దాసరి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్బయ్య, బీసీ చైతన్య సమితి అధ్యక్షులు బీసీ రమణ, యాదవ సంఘం నాయకులు ఓబులేసు యాదవ్, రాష్ట్ర రజక నాయకులు బద్వేల్ గురుమూర్తి, బోయ రాష్ట్ర నాయకులు డాక్టర్ మల్లెల భాస్కర్, తొగట వీర క్షత్రియ రాష్ట్ర నాయకులు మల్లికార్జున, సగర రాష్ట్ర నాయకులు రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం

- జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి
- అర్ధ వార్షిక నేర సమీక్షలో పాల్గొన్న డీఐజీ, ఎస్పీ



నేర సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో డీఐజీ, ఎస్పీ


సమావేశంలో పాల్గొన్న పోలీసు, ఇతర శాఖల అధికారులు

కడప అర్బన్ : సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమైనదని.. పోలీసు, జ్యుడిషియల్ శాఖల అమలులో నిక్కచ్చిగా వ్యవహరిస్తేనే నేరాలను అరికట్టగలమని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శనివారం కడపలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2025 అర్ధ వార్షిక నేర సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్‌తోపాటు, కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్, జిల్లా ఫారెస్ట్ అధికారి వినీత్ కుమార్, సెవెంత్ ఏడీజే జీఎస్ రమేష్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఖదీరున్, ఫోరెన్సిక్ ఐ.టి నిపుణులు సురేంద్ర కుమార్ హాజరయ్యారు. ఈ సమీక్షలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, అటవీశాఖ, ఫైర్, జైలు, జ్యుడిషియల్ శాఖల అధికారులతో.. ఆరు నెలల కాలంలో నమోదైన గ్రేవ్ – నాన్ గ్రేవ్, హత్య, పోక్సో, అత్యాచారం, డెకాయిటి, రాబరీ, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, మిస్సింగ్, చీటింగ్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, 174 సీఆర్‌పీసీ కేసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్, డీఐజీ, ఎస్పీలు సమీక్ష నిర్వహించారు. ఈగల్ టీం ఆధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్‌కి గుడ్ బై చెబుదాం, డ్రగ్స్ వద్దు బ్రో, మాదకద్రవ్యాల వినియోగాన్ని కట్టడి చేయాలనే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, అదనపు ఎస్పీ (ఎ.ఆర్) బి.రమణయ్య, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్.సుధాకర్, కడప డీఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, రైల్వే, న్యాయ, రెవెన్యూ, ఫారెస్ట్, రవాణా, ఎక్సయిజ్, వైద్య, ఫైర్, జైళ్ల శాఖ, తదితర అధికారులు, ఈగల్ టీం సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ అధికారులకు ఫైరింగ్ ప్రాక్టీస్ ప్రారంభం

పోలీస్ అధికారులకు ఫైరింగ్‌లో ప్రాక్టీస్‌ను డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ నగర శివార్లలోని ఫైరింగ్ రేంజ్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ ఈజీ అశోక్ కుమార్, డీఎఫ్ఓ వినీత్ కుమార్ పాల్గొన్నారు.